సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కావలి మండలంలోని గౌరవరం దాటిన తర్వాత ముంగమూరు కూడలి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒట్టూరి సుధీర్ (35) అనే వ్యక్తి శనివారం మృతిచెందాడు.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,010
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,539
3 శాతం జీఎస్టీతో	రూ.5,705
సవర (8 గ్రా)	రూ.45,640

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /28.0

శనివారం గాలిలో 65 శాతం తేమ ఉంది. ఆదివారం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

'క్రెడాయ్' ప్రాపర్టీ ఎక్స్‌పోను సందర్శించిన వేమిరెడ్డి



వేమిరెడ్డిని సన్మానిస్తున్న ఎక్స్‌పో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీకస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న మెగా ప్రాపర్టీ ఎక్స్‌పోను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం సందర్శించారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన ప్రతిఒక్కరూ లేఅవుట్లకు తప్పనిసరిగా అప్రూవల్ తీసుకోవాలని సూచించారు. బిల్డర్స్ అందరూ నిబంధనలకు లోబడి నాణ్యమైన నిర్మాణాలు ప్రజలకు అందించాలన్నారు. క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ కమిటీ సభ్యులను వేమిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ ప్రెసిడెంట్ డి.రామకృష్ణ, గ్రీవెన్స్ చైర్మన్ డి.రాజశేఖరనాయుడు, సెక్రటరీ టి.మధుసూదన, ఉపాధ్యక్షులు ఎం.రామమూర్తిరెడ్డి, టి.నరేంద్రరెడ్డి, జాయింట్ సెక్రటరీలు ఈ.శ్రీధర్‌రెడ్డి, డి.గిరిప్రసాద్, డి.హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ సందడి



నెల్లూరులోని బంగారు దుకాణంలో కొనుగోలుదారులు

నెల్లూరు(బృందావనం): అక్షయ తృతీయ నాడు బంగారం కొనుగోలు చేస్తే ఐశ్వర్యంతోపాటు సౌభాగ్యం ప్రాప్తిస్తుందని నమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో శనివారం అక్షయ తృతీయ సందర్భంగా నెల్లూరులోని బంగారు దుకాణాలు కళకళలాడాయి. గతేడాది కంటే ఈ ఏడాది గ్రాము బంగారం ధర రూ.1,000 పెరిగింది. దీంతో కొనుగోళ్లు మందగిస్తాయని బంగారు వ్యాపారులు భావించారు. అనేకమంది ప్రతి ఏడాది నెలరోజుల ముందే గోల్డ్ షాప్‌లకు వెళ్లి శక్తి కొద్దీ బంగారం వస్తువులను ఆర్డర్ ఇచ్చి అక్షయ తృతీయ నాడు డెలివరీ చేసుకుని ఇంటికి తెచ్చుకునేవారు. అయితే ఏకంగా ఈ ఏడాది పది గ్రాములకు రూ.10,000 పెరగడంతో కొనుగోళ్లు గతంలో మాదిరి కాకుండా నాలుగు రోజులకే పరిమితమయ్యాయని గోల్డ్ షాప్ యజమాని ఒకరు తెలిపారు. అలాగే ఆదివారం అక్షయ తృతీయ ఉండడంతో కొనుగోళ్లు కొంత ఆశాజనకంగా ఉండొచ్చన్నారు.

సోమశిలలో 51.910 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 51.910 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 214 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.671 మీటర్లుగా ఉంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ హర్షం

నెల్లూరు(టౌన్): ప్రైవేట్ స్కూల్స్ గుర్తింపును 8 సంవత్సరాలకు పెంచడంపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం స్కూల్స్‌కు మూడు సంవత్సరాలకు ఒకసారి ఇస్తున్న గుర్తింపును ఎనిమిది సంవత్సరాలకు పెంచు తూ జీఓ విడుదల చేశారని తెలియజేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కాకాణి, ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రంజాన్ ప్రార్థనలు

రంజాన్ పర్వదినం సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద శనివారం సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్దసంఖ్యలో విచ్చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

– నెల్లూరు(బృందావనం)

అడవికి రక్షణ

వేసవి కాలంలో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఒక్కోసారి కార్చిచ్చుగా మారి చెట్లు కాలి బూడిదవుతుంటాయి. మూగజీవాలు చనిపోతుంటాయి. అటవీ సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. అలాగే తర్ఫీదు పొందిన సిబ్బందిని రంగంలోకి దించి మంటలను అదుపులోకి తెస్తున్నారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

- వేసవిలో అగ్నిప్రమాదాలతో ముప్పు
- ఒక్కోసారి కార్చిచ్చుగా మారుతున్న వైనం
- సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా
- మంటలు రేగిన పది నిమిషాల్లోనే శాటిలైట్ ద్వారా గుర్తింపు
- వెంటనే ఆర్పివేసేలా తెచ్చేలా చర్యలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో 2.29 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో వివిధ రకాల వన్యప్రాణులు, 46 రకాల పక్షి జాతులున్నాయి. ప్రధానంగా జింకలు, అడవి పందులు, కుందేళ్లు, నక్కలు, చిరుతపులులు, నెమళ్లు తదితర ప్రాణులు సంచరిస్తుంటాయి. ఎండా కాలంలో అడవుల్లో అగ్నిప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటాయి. వివిధ కారణాలతో ఎక్కడో ఒకచోట మంటలు చెలరేగుతుంటాయి. వెంటనే ఆర్పకపోతే ఒక్కోసారి కార్చిచ్చుగా మారే అవకాశముంది.

ఏమి చేస్తున్నారంటే..

వేసవి కాలంలో తరచూ మంటలు చెలరేగే ప్రాంతాలను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఎక్కడైనా మంటలు వస్తుంటే శాటిలైట్ ద్వారా పది నిమిషాల్లో తెలుసుకోగలుగుతున్నారు. సిబ్బంది అప్రమత్తమై అక్కడికి వెళ్లి మంటలను ఆర్పివేసే చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ వేసవికాలం ముగిసే వరకు జరుగుతుంది.



అటవీ ప్రాంతంలో అగ్నివీరుల బృందం

వీరు కీలకం

అటవీ ప్రాంతంలో మంటలను ఆర్పేందుకు అధికారులు 160 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వారికి అగ్నివీరులని నామకరణం చేశారు. వీరంతా నిత్యం అటవీ ప్రాంతంలో తిరుగుతూ ఎక్కడైనా మంటలు వస్తున్నాయా అని ఓ వైపు గమనిస్తూ ఉంటారు. అలాగే శాటిలైట్ ద్వారా సమాచారం అందితే వెంటనే ప్రాణాలకు తెగించి ఆయా ప్రదేశానికి వెళ్లి మంటలు వ్యాప్తి కాకుండా తక్షణమే ఆర్పుతారు. అగ్నివీరులు ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ద్వారా పారితోషికాన్ని అందిస్తోంది.

మూడు నెలల్లో..

జిల్లా అటవీ ప్రాంతంలో గత మూడు నెలల్లో 180 సార్లు మంటలు చెలరేగాయి. ప్రతిసారి ఘటనా స్థలానికి అగ్నివీరులు వెళ్లి మంటలను ఆర్పివేశారు. దీంతో అటవీ ప్రాంతానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అంతేకాకుండా జంతువులు కూడా సురక్షితంగా ఉన్నాయి. అగ్నివీరులే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, సమీపాన ఉన్న గ్రామాల ప్రజలు మొత్తం కలిపి 1,277 మంది అడవులను కాపాడే విషయంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకున్నాం



వేసవి కాలంలో వివిధ కారణాలతో ఎక్కడో ఒకచోట మంటలు చెలరేగుతుంటాయి. పది నిమిషాల్లో శాటిలైట్ ద్వారా సమాచారం వస్తుంది. తమ సిబ్బంది, అగ్నివీరులు తక్షణమే స్పందించి మంటలు ఆర్పి వేయడం జరుగుతుంది. జిల్లాలో మూడునెలల్లో 180 సార్లు అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. వెంటనే ఆర్పడంతో అటవీ సంపదకు, జంతువులకు నష్టం వాటిల్లలేదు.

– చంద్రశేఖర్, జిల్లా అటవీ శాఖాధికారి (టెరిటోరియల్)

దిగ్విజయంగా దూసుకెళ్తూ..

- వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రో దిట్ట
- ఇప్పటికే 422 విదేశీ ఉపగ్రహాలు కక్ష్యలోకి..
- తాజాగా సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను కూడా..
- ఏడాదికి రూ.1,000 కోట్లకుపైగా ఆదాయం



నిప్పులు చిమ్ముకుంటూ దూసుకెళ్తున్న పీఎస్ఎల్‌వీ సీ55


సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్యపరమైన ప్రయోగాల్లో దిగ్విజయంగా దూసుకెళ్తోంది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూమధ్యరేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండడంతో గ్రావిటీ పవర్ తక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ వాణిజ్యపరమైన ప్రయోగాలకు తక్కువ వ్యయం అవుతోంది. అందుకే ప్రపంచంలోని చాలాదేశాలు న్యూస్పేస్ ఇండియా వారితో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రెండు టన్నులకు మించి బరువు కలిగిన అతిపెద్ద ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష కేంద్రాల నుంచి పంపిస్తుండగా.. అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించి వాణిజ్యపర ప్రయోగాలకు ఇస్రో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇప్పటివరకు 57 పీఎస్ఎల్‌వీ, రెండు ఎల్‌వీఎం3 రాకెట్ల ద్వారా 35 దేశాలకు చెందిన 422 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మరో ఏడు దేశాలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఎంఓయూ చేసుకున్నట్లు ఇస్రో ప్రకటించింది. సంవత్సరానికి సుమారు రూ.1,000 కోట్లకు పైగా వాణిజ్యపరంగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను ప్రయోగించి ఈ ఏడాది రెండో వాణిజ్యపరమైన విజయాన్ని అందుకుంది.

గమనం ఇలా..

షార్ నుంచి శనివారం పీఎస్ఎల్‌వీ సీ55 రాకెట్ ప్రయాణం దశల వారీగా విజయవంతమైంది. నాలుగు దశలు దిగ్విజయంగా పనిచేస్తూ సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను నిర్దేశిత సమయంలో నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. 44.4 మీటర్ల పొడవు కలిగి 228 టన్నుతో నింగివైపునకు తన ప్రయాణాన్ని కొనసాగించింది. రాకెట్‌లోని మొదటి దశలో నింపిన 139 టన్నుల ఘన ఇంధనంతో 110.5 సెకన్లకు పూర్తి చేశారు. 41 టన్నుల ద్రవ ఇంధనంతో రెండో దశను 261.7 సెకన్లకు, 7.65 టన్నుల ఘన ఇంధనంతో మూడో దశను 588 సెకన్లకు పూర్తిచేశారు. నాలుగో దశలో 0.8 టన్నుల ద్రవ ఇంధనంతో 1,115 సెకన్లకు కటాఫ్ చేశారు. ఆ తర్వాత 19.55 నిమిషాలకు ముందుగా 781 కిలోల బరువు కలిగిన టెలియోస్–2 ఉపగ్రహాన్ని, 20.55 నిమిషాలకు లూమిలైట్–4 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టి విజయం సాధించారు.



టెలియోస్–2 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదులుతున్న రాకెట్



మూడోదశలో రాకెట్ గమనం



నాలుగో దశలో ఉపగ్రహాలను మోసుకెళ్తూ..

నేడు ఫైనల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు క్లబ్‌లో జరుగుతున్న క్యారమ్ ర్యాంకింగ్ పోటీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. శనివారం డబుల్స్ పోటీల్లో మలిరెడ్డి కోటారెడ్డి, డాక్టర్ ప్రసాద్‌జట్టు – వి.రమణయ్య, ఎం.మహేష్‌రెడ్డి జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో కోటారెడ్డి, ప్రసాద్ జట్టు విజయం సాధించింది. సింగిల్స్‌లో మద్దెన విశ్వనాథ్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఆదివారం ఫైనల్స్, జిల్లా ర్యాంకింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష నేడు

నెల్లూరు(వేదాయపాళెం): గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ టి.హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ముత్తుకూరు, కోడూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, బోగోలు, రాపూరు, ఆదూరుపల్లి, పెద్దపవనిల్లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలియజేశారు. ఐదో తరగతికి సంబంధించి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కి సంబంధించి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఆధార్ కార్డు జెరాక్స్, హాల్‌టికెట్ తప్పని సరిగా తీసుకెళ్లాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 82473 58603 , 94940 90137, 98857 32146 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జీజీహెచ్‌లో పెయిన్ రిలీఫ్ సెంటర్ ఏర్పాటు

- దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో పెయిన్ రిలీఫ్ ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సాధారణ నొప్పులతోపాటు కేన్సర్, సిర్రోసిస్ ఆఫ్ లివర్ లాంటి క్రానికల్ వ్యాధుల్లో చివరిదశలో ఉండి తీవ్ర నొప్పులతో అల్లాడే వారికి చికిత్స అందిస్తారు. ఈ సెంటర్లు కార్పొరేట్ ఆస్పత్రులకే పరిమితం. అలాంటి ప్రత్యేక విభాగాన్ని ఇప్పుడు సర్వజన ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. శనివారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. అనస్థీషియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ (హెచ్‌ఓడీ) డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, రాజశేఖర్, సుబ్బారావు, జమున, ఉమాశ్రీ, సురేష్, వేణుగోపాల్, జగదీష్‌తో కూడిన వైద్యుల ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నలుగురు పీజీ డాక్టర్లు, మరో నలుగురు టెక్నీషియన్లతోపాటు స్టాఫ్ నర్సింగ్ సిబ్బంది వైద్యసేవలందించనున్నారు. పెయిన్ రిలీఫ్ కోసం ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఆర్ఎఫ్‌టీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ లాంటి పరీక్షలతో పాటు ఫిజియోథెరపీ చేస్తారు. ఐపీ బిల్డింగ్‌లో మూడో అంతస్తులో ఆపరేషన్ థియేటర్లకు పక్కనే ఉండేలా ఈ విభాగాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సెంటర్‌లో అన్ని రకాల మందులతోపాటు ఇంజెక్షన్లు అందుబాటులో సిద్ధంగా ఉంచామన్నారు. దీర్ఘకాలిక నొప్పులతోపాటు సాధారణ నొప్పులకు వైద్యం అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



జీజీహెచ్‌లో రిలీఫ్ కేంద్రం వద్ద డాక్టర్లు

ప్రభుత్వ బడులకు భద్రత

- జిల్లాలోని 279 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వాచ్‌మెన్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో మొత్తం 279 ఉన్నత పాఠశాలల్లో వాచ్‌మెన్ నియామకాలను చేపట్టనున్నారు. వీటిలో 245 జిల్లా పరిషత్, 15 ప్రభుత్వ, 19 మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో వాచ్‌మెన్‌ను నియమించనున్నారు. వీరికి నెలకు రూ.6 వేలు వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. తొలి విడతలో నాడు-నేడు పనులు పూర్తయిన పాఠశాలలు, రెండో విడతలో నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో ఈ వాచ్‌మన్‌ల నియామకం చేపట్టనున్నారు. ఇటీవల కాలంలో రాత్రుల సమయాల్లో కొంతమంది పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పాఠశాలల్లోని ఫర్నిచర్, విలువైన వస్తువులకు భద్రత లేకపోవడంతో వాచ్‌మెన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నియామకాలు, విధులు

- పేరెంట్స్ కమిటీల ఆధ్వర్యంలో నియమితులైన వారు పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించాలి.
- ఇప్పటికే ఉన్న ఆయా, కుక్ కమ్ హెల్పర్ భర్తలకు నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుంది.
- వాచ్‌మన్ వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి.
- పాఠశాల మూసివేయడానికి ముందుగా విధులకు రావాలి.
- పనిదినాల్లో మరుసటి రోజు పాఠశాల తెరిచేవరకు విధుల్లో ఉండాలి. ఇతర రోజుల్లో కూడా విధులు నిర్వహించాలి.
- సంబంధిత ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో వాచ్‌మన్ పనిచేయాలి.
- భవనం, ప్రాంగణం, ఇతర మౌలిక సదుపాయాలను కాపాడడంతోపాటు పాఠశాల ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులెవరూ ప్రవేశించకుండా ఉండేలా వాచ్‌మన్ విధులు నిర్వహించాలి.
- సాయంత్రం పాఠశాల గార్డెన్‌కు నీరు పెట్టాలి.
- ఆర్‌ఓ ప్లాంట్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సి ఉంటుంది.
- పాఠశాల వెలుపల పంపిణీ చేసిన మెటీరియల్‌ను స్వీకరించి హెచ్‌ఎంకు అందజేయాలి.
- హెడ్మాస్టర్, పేరెంట్స్ కమిటీ ఎప్పటికప్పుడు నైట్ వాచ్‌మన్ పనితీరును పర్యవేక్షిస్తుంది.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్





ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలకు విచ్చేసిన ముస్లింలు, పాల్గొన్న మంత్రి కాకాణి, ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి

- ఆనందోత్సాహాలతో రంజాన్
- బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ పండగ(ఈద్-ఉల్-ఫిత్ర్)ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని మసీదుల్లో, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, నమాజులు చేశారు. మతపెద్దలు సందేశాలను వినిపించారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ ఒ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మికచింతనల కలయికే ఈద్-ఉల్-ఫిత్ర్ అని పేర్కొన్నారు. దానగుణం సర్వపాపాలను హరించి పుణ్యఫలం కలిగిస్తుందని మహాప్రవక్త మహమ్మద్(సఅస) పేర్కొన్నారన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష పాటించడం ద్వారా ఆత్మశుద్ధి పొందుతారన్నారు.

అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి

రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం లందరి జీవితాల్లో అల్లా సుఖసంతోషాలు నింపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండగ జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. బారాషహీద్ దర్గా ఈద్గా వద్ద జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బారాషహీద్ దర్గా అభివృద్ధికి ఏదైతే గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారో ఆ జీఓకు ఫైనాన్స్ క్లియరెన్స్ వచ్చిందని మంత్రి కాకాణి తెలిపారు. త్వరలోనే నిధులు కేటాయించి ముస్లింల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అల్లాహ్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలనని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రార్థనల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి దుర్మరణం

కావలి: మండలంలోని గౌరవరం దాటిన తరువాత ముంగమూరు కూడలి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ముంగమూరుకు చెందిన ఒట్టూరి సుధీర్(35) మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ముంగమూరుకు చెందిన ఒట్టూరి సుధీర్ కావలి మండలం ముసునూరులో నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ప్రతిరోజూ ముంగమూరు నుంచి వెళ్లి కూలీలతో పనులు చేయించి వస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పనులు పూర్తయిన తరువాత తిరిగి ఇంటికి వస్తుండగా ముంగమూరు కూడలి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని సుధీర్ మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోధించారు. ఐదు నిమిషాల్లో ఇంట్లో ఉండాల్సిన సుధీర్ అర్థాంతరంగా తనువు చాలించాడంటూ అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సుధీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుధీర్ తండ్రి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మూడో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కింద పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన త్యాగరాజనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గొలగమూడికి చెందిన రమ - పెంచలయ్య దంపతులు. వారికి ఇద్దరు కుమార్తెలతోపాటు ఒక కుమారుడు మధు(24) ఉన్నాడు. పెంచలయ్య రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మధు నెల్లూరులో తెలిసిన వారి వద్ద ఉంటూ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుడప్పుడు తల్లి వద్దకు వచ్చి వెళ్లేవాడు. కొద్దిరోజులుగావేదాయపాళెం త్యాగరాజనగర్‌లో మూడంతస్తుల భవనానికి సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. శనివారం మధు మూడో అంతస్తులో సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయి మృతిచెందాడు.ఈవిషయాన్ని తన అల్లుడు సుమన్ ద్వారా తెలుసుకున్న రమ హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమైంది. మధు తల్లి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

చిత్తూరు, అనంత జట్ల జయకేతనం

కడప స్పోర్ట్స్: ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్స్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు జయకేతనం ఎగురవేశాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శనివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 90 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సాకేత్‌రామ్ 21, మోహన్‌కృష్ణ 20 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ వై.గిరీష్‌కుమార్‌రెడ్డి 4, దీపన్‌సాయినాథ 2, సూర్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 11.3 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని అభిషేక్‌రెడ్డి 41, పృథ్వీరాజ్ 26 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

'అనంత'కు వరుసగా రెండో విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. జట్టులోని తాఫిక్ హుస్సేన్ 51 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు వినయ్‌కుమార్ 2, దీపక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 14.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని ఎం.కె.దత్తారెడ్డి 56 పరుగులు, యోగానంద 34 పరుగులు చేశారు. దీంతో అనంత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి:	రూ.75
సన్నవి:	రూ.50
పండ్లు:	రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	123
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	240
లేయర్ చికెన్ :	128

తుమ్మల పెంట బీచ్‌లో యువకుడి గల్లంతు

కావలి: మండలంలోని తుమ్మలపెంట బీచ్‌లో యువకుడు గల్లంతైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. తుమ్మలపెంటకు చెందిన మహేంద్ర స్నేహితులతో కలిసి సముద్రంలో ఈతకు వెళ్లగా అలల ఉధృతి కారణంగా గల్లంతైనట్లు తెలిసింది. స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు మహేంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్–బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'అహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోకాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్‌ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

''మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్‌ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్‌ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్‌ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్ల వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్ లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సినిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్‌ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్): మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పిగా' (పీఐజీ–ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రోటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం, చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ : ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటిది లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్–బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.



ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.